క్లుప్తంగా

ఎస్సీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీగా లంకా



కారెంపూడి: మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన లంకా నాగేశ్వరరావు పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు. జిల్లా పార్టీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోమవారం ఆయనకు ఈ మేరకు నియామక పత్రం అందించారు. సామాన్య కార్యకర్తగా పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించి తనకు జిల్లా స్థాయి పదవి అప్పగించడం పట్ల నాగేశ్వరరావు జిల్లా పార్టీ అధ్యక్షులు పీఆర్కేకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పీఆర్కేను ఘనంగా సన్మానించారు. నాగేశ్వరరావుకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో చింతపల్లి ఎంపీటీసీ తాళ్లపోగు అచ్యుతరావు, అలుగునూరి అమరయ్య, లంకా ఇర్మియా, దారివేముల కిరణ్, నన్నెపోగు రాజేష్, పాలెపోగు దాసు, గుడిపాటి మణి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ దరఖాస్తుకు ఆహ్వానం



జెట్టిపాలెం(రెంటచింతల): మండల పరిధిలోని జెట్టిపాలెం గ్రామ శివార్లోనున్న ఏపీ మోడల్ స్కూల్, కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులు మే 22వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన మోడల్ స్కూల్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు ఉన్నాయని, ఆంగ్లంలో బోధన ఉంటుందని, ఎటువంటి ఫీజులు ఉండవన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 10వ తరగతి పాస్ అయి ఉండాలన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 10వ తరగతిలో విద్యార్థులకు వచ్చిన మార్కుల మెరిట్, రిజర్వేషన్ రూల్స్ ప్రకారం సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాలలో బాలికలకు హాస్టల్ వసతి కూడా ఉందన్నారు. ఈ పాఠశాల 2023–24 సంవత్సరానికి 9వ తరగతికి సీబీఎస్ఈ గుర్తింపు పొందినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9182958496, 7075810553 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రత్యేక వాహనం ద్వారా ఓటర్లలో చైతన్యం



రెంటచింతల: ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా సద్వినియోగం చేసుకోవడానికి భారత ఎన్నికల సంఘం ఓ ప్రత్యేక వాహనం ద్వారా వారిలో చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు నోడల్ ఆఫీసర్ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పెదప్రోలు శంకర్‌రావు అన్నా రు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని గ్రామాలలో స్వేచ్ఛగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నో భాషలు, కులాలు, మతాలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు భిన్నంగా ఉన్న దేశ ప్రజలందరినీ ఏకతాటిపై ఉంచగలిగే వ్యవస్థ మనదే కావడం మనందరికి గర్వకారణమన్నారు. ప్రతి వ్యక్తి తన మనస్సాక్షి ప్రకారం ఓటును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు భంగం కలిగించవద్దన్నారు. ఈ నెల 10న గోలి, జెట్టిపాలెం, సత్రశాల, మల్లవరం 11న పాలువాయి, కొత్త పాలువాయి, పాలువాయి గేటు, పశర్లపాడు, మంచికల్లు, 13న మిట్టగుడిపాడు, రెంటాల, రెంటచింతల, తుమ్మకోట, కొత్త గంగరాజుపల్లి, విశ్రాంతిపురం గ్రామాలలో ప్రత్యేక వాహనం ద్వారా ఓటర్లను చైతన్య పరచడం జరుగుతుందన్నారు.

జగనన్న కోసం వలంటీర్ రాజీనామా



పిడుగురాళ్ల: జగనన్న కోసం వలంటీర్ ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు పిడుగురాళ్ల పట్టణానికి చెందిన వలంటీర్ దూదేకుల మస్తాన్‌వలి సోమవారం రాజీనామా లేఖను సచివాలయ అడ్మిన్ రహమాన్‌కు అందించాడు. ప్రతి నెల వృద్ధులకు, దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ చేసేటప్పుడు వాళ్ల మొహంలో కనిపించే ఆనందం చెప్పలేనంత గొప్పగా ఉంటుంది. ముఖ్యమంతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైనికుల్లా మా వలంటీర్లు పని చేస్తున్నారు. మాకు ఇచ్చే గౌరవ వేతనం కోసం పని చేయడం లేదు, జగనన్న సైనికుల్లా ఆయన చేసే కార్యక్రమాల్లో చిన్న సేవకులుగా పని చేస్తున్నాం అని మస్తాన్ వలి తెలిపాడు. ఎన్నికల కమిషన్ మా వలంటీర్లకు సేవ చేసుకునే అవకాశం కల్పించనప్పుడు వలంటీర్లుగా రాజీనామా చేసి జగనన్న సైనికుల్లా సమాజంలో సేవ చేస్తాం అంటు తన రాజీనామా లేఖను అధికారులకు అందించాడు.

గౌడ సంఘీయుల అభివృద్ధికి కృషి చేస్తా

ప్రభుత్వ విప్ పీఆర్కే



గౌడ సంఘ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: నియోజకవర్గంలో గౌడ సంఘీయుల అభివృద్ధికి సంక్షేమంతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టి వారికి ఈ ఐదు సంవత్సరాలు ప్రయోజనం కల్పించినట్లు పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో 20వ వార్డులో ఏర్పాటు చేసిన గౌడ సంఘ ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టణంలోని గౌడ సంఘానికి సంబంధించిన అభివృద్ధి పనులలో భాగంగా వివిధ కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ పింఛన్, ఇంటి స్థలం ఇచ్చినట్లు ప్రభుత్వ విప్ పీఆర్కే చెప్పారు. రాబోయే రోజుల్లో మరోసారి సీఎం జగన్ అధికారంలోకి రాగానే శ్రీశైలం రోడ్డులోని ఆంజనేయ స్వామి దేవాలయంలో కమ్యూనిటీ హాలు కట్టుకునేందుకు రూ.25 లక్షల నిధులు కేటాయిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ జగన్‌కు మద్దతు పలికి మరోసారి సీఎం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఈ ఆత్మీయ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు బూదాల మరియమ్మ, గౌడ సంఘం అధ్యక్షులు మేకపోతుల కొండలు, కౌన్సిలర్లు చందూగౌడ్, బత్తిన వేణు, రామగాని శంకర్, గౌడ సంఘ నాయకులు బి.సైదయ్య, మేకపోతుల నాగేశ్వరరావు, వడ్డెంగుంట శివ, వడ్డెంగుంట వెంగయ్య, చెన్నయ్య, కొమెర లాలు, ఇంద్ర, కొండ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌడ సంఘ మహిళలు ప్రభుత్వ విప్ పీఆర్కేను ఘనంగా సత్కరించారు.

ఇంటింటికి పింఛన్లు అడ్డుకుంది చంద్రబాబు అండ్ కో

వైఎస్సార్‌సీపీ మండల నాయకులు



పిడుగురాళ్లలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో



దాచేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో

పిడుగురాళ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల వద్దకు పాలన అందిస్తూ, దివ్యాంగులకు, వృద్ధులకు, వితంతువులకు నేరుగా వలంటీర్ల ద్వారా ప్రతి ఇంటికి పింఛన్ అందిస్తుంటే అది ఇప్పుడు తప్పు అయినట్లు చంద్రబాబు అండ్ కో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి ఇంటింటికి వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయకుండా అడ్డుకోవడం దుర్మార్గం అని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ వృద్ధులు, దివ్యాంగులు వంటి వారు నేరుగా ఎన్నికల బుతు వద్దకు వచ్చే పనిలేకుండా ఇంటి వద్దే ఉండి ఓటు వేయవచ్చు అని చెబుతుంటే, గత 5 సంవత్సరాలుగా ఇంటింటికి వెళ్లి వలంటీర్లు పింఛన్లు అందిస్తుంటే ఇప్పుడు చంద్రబాబు అండ్ కో ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేసి పింఛన్లు పంపిణీ నిలిపివేయడం ఏమిటీ అని ప్రశ్నించారు. ఒక్క జాన పాడు గ్రామంలో 1500 పింఛన్లు ఇవ్వాలి. వలంటీర్లు అయితే ఒకటి, రెండు రోజుల్లో వారు ప్రతి ఇంటికి వెళ్లి పింఛన్ పంచుతారు. ఇప్పుడు సచివా లయ ఉద్యోగులు సచివాలయాల్లో ఇవ్వాలి. అది కుడా ఈ వేసవి ఎండల్లో వృద్ధులు, వికలాంగులు గ్రామాల్లోని సచివాలయల వద్దకు వచ్చి క్యూలో నిలబడి గంటల తరబడి నిరీక్షించి పింఛన్ తీసుకోవాల్సిన పరిస్థితిని చంద్రబాబు తెచ్చాడని చెప్పారు. చంద్రబాబుకు వృద్ధులు, దివ్యాంగులు వితంతువుల ఉసురు తప్పక తగులుతుందన్నారు. ఎన్ని కల కమిషనర్ ఈ సమస్యపై మరోసారి పరిశీలించి వలంటీర్ల ద్వారా పెంఛన్ పంఫిణీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరుకుంటున్నాం అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి అఖండ మేజార్టీతో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందాం అప్పుడు తిరిగి ప్రతి ఒక్కరికి ఇంటి వద్దకే పింఛన్, గ్రామ స్వరాజ్యం ప్రజల చెంతకు చేరుతుందన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ వీరభద్రుని రామిరెడ్డి, వైస్ ఎంపీపీ గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చింతా సుబ్బారెడ్డి, మండల మైనార్టీ కన్వీనర్ షేక్ మోర్జంపాటి ఖాశీం, రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి కొతారు నరసింహారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్‌దారులే చంద్రబాబుకు గుణపాఠం చెబుతారు

దాచేపల్లి : చంద్రబాబు, ఎల్లో మీడియా దుర్మార్గాలను పింఛన్‌దారులు గమనిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా పింఛన్ నగదు పంపిణీ కార్యక్రమాన్ని టీడీపీ నేతలు, ఎల్లో మీడియా అడ్డుకోవటం దుర్మార్గమైన చర్య అని పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ సుభానీ అన్నారు. వలంటీర్లు నేరుగా పింఛన్ దారుల ఇళ్లకే వెళ్లి పింఛన్ నగదు ఇస్తున్నారని, ఇప్పుడు చంద్రబాబు, ఎల్లో మీడియా చేసిన కుట్రల వలన పింఛన్ తీసుకుంటున్న వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు భగభగమండే ఎండలో సచివాలయం వద్ద గంటల తరబడి వేచి నగదు తీసుకునే పరిస్థితి కల్పించారని మండిపడ్డారు. పింఛన్ దారులు ప్రశాంతంగా ఉండటం ఇష్టం లేకనే చంద్రబాబు వలంటీర్ల పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని అడ్డుకున్నారని, ఎన్నికల్లో పింఛన్‌దారులు చంద్రబాబుకు గుణపాఠం చెబుతారన్నారు. పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య మాట్లాడుతూ...పింఛన్ తీసుకుంటున్న వారికి ఇబ్బందులు కలుగజేయటమే లక్ష్యంగా చంద్రబాబు పని చేస్తున్నారని, చంద్రబాబు దుర్మార్గాలపై ఓటు ద్వారా పింఛన్‌దారులు కసి తీర్చుకుంటారన్నారు. ఈ సమావేశంలో పార్టీ మాజీ కన్వీనర్ మునగా పున్నారావు, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, కౌన్సిలర్ చాట్ల క్రాంతికుమార్, యువజన విభాగం మండల కన్వీనర్ కాసర్ల నరసింహారెడ్డి, నాయకులు షేక్ ఖాదర్‌బాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, మునగా శ్రీనివాసరావు, దాచేపల్లి సైదారావు, కొమ్ము బుజ్జి, జంగాల సింగరయ్యయాదవ్, సయ్యద్ మౌలాలీ, షేక్ సైదా, కొలా జంపాలరెడ్డి, బండ్ల యాకోబు, కొలా శ్రీనివాసరెడ్డి, షేక్ సైసావలి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు



వాహానాలను తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి పాపయ్య, సిబ్బంది

రెంటచింతల: ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో ఎవ్వరూ కూడా వ్యక్తిగతంగా రూ.50 వేలకు మించి నగదును తీసుకువెళ్లవద్దని మండల ఎన్నికల నియమ నిబంధనల పర్యవేక్షణ (ఫ్లయింగ్ స్క్వాడ్) అధికారి కె.పాపయ్య అన్నారు. ఈ సందర్భంగా పాపయ్య మాట్లాడుతూ సోమవారం రెంటచింతల-గురజాల గ్రామాల మధ్య ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరుకు మాచర్ల-గుంటూరు ప్రధాన రహదారిపై వాహానాలను క్షుణ్ణంగా తనిఖీ చేశామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 2024 మే 13న ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ముమ్మరంగా తనిఖీలు చేపట్టడం జరుగుతుందన్నారు. మండలంలోని గ్రామాలలో పర్యటిస్తూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయడంలో భాగంగా ఈ తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. వాహనాలలో నగదు, మద్యం, బంగారం, వెండి వస్తువుల తరలింపును నియంత్రించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు. ప్రజలు కూడా గ్రామాలలో ఎక్కడైనా ఎన్నికల నియమ నిబంధనలకు వ్యతిరేక పనులకు పాల్పడుతున్న వారి సమాచారం సి-విజిల్ యాప్ ద్వారా తమకు ఇచ్చినట్లయితే వెంటనే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. మొత్తం 68 వాహనాలను తనిఖీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తనిఖీ సిబ్బంది తదితరులున్నారు.

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసు కవాతు



దుర్గి: రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సోమవారం మండలంలోని పలు గ్రామాలలో పోలీసు కవాతు నిర్వహించారు. ధర్మవరం, శ్యామరాజుపురం, జంగమహేశ్వరపాడు, ఆత్మకూరు గ్రామాలలో సీఐ చిన్న మల్లయ్య, ఎస్ఐ కోటయ్యల ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ చిన్న మల్లయ్య మాట్లాడుతూ శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. అసాంఘిక శక్తుల పట్ల చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించకుండా రాజకీయ పార్టీ నేతలు ప్రచారం నిర్వహించుకోవాలని కోరారు. ఆయా గ్రామాలలో నెలకొన్న ఎన్నికల వాతావరణం గ్రామస్తులతో మాట్లాడి తెలుసుకొని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామస్తులు సాయుధ బలగాలు నిర్వహిస్తున్న కవాతును ఆసక్తిగా తిలకించారు.

గ్రామాలలో ఫ్లాగ్ మార్చ్



కారెంపూడి: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేందుకు వీలుగా సమస్యాత్మక గ్రామాలలో సైతం ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా గ్రామాలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు కారెంపూడి సీఐ చినమల్లయ్య చెప్పారు. వేపకంపల్లి, చినగార్లపాడు, ఒప్పిచర్ల గ్రామాలలో కేంద్ర భద్రతా బలగాలు, పోలీసులు సంయుక్తంగా ఆదివారం రాత్రి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకరరెడ్డి, డీఎస్పీ పల్లపురాజుల ఆదేశాల మేరకు ప్రజలకు భరోసా కల్పించేందుకు గ్రామాలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అందుకు అవసరమైన భద్రతా చర్యలు పోలీస్ శాఖ ఉన్నతాధికారులు తీసుకుంటున్నారని సీఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



వెల్దుర్తి: మాచర్ల నుంచి మిర్చి కూలీ పనుల నిమిత్తం వెల్దుర్తి మండలంలోని కండ్లకుంట గ్రా మానికి వెళ్లేందుకు ఆటోలో ప్రయాణిస్తుండగా మండాది సమీపంలో ఆటోకు ఎదురుగా అడవి పందులు రావటంతో ఆటో బండిని ఢీకొట్టింది. ఆటో బోల్తా పడటంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఆర్.నారాయణమ్మ (45) అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని హుటాహుటిన మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకు నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు

డీవీఎం కృష్ణ చైతన్య



విజయపురిసౌత్: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని పర్యాటక శాఖ విజయవాడ డివిజనల్ మేనేజర్ కృష్ణ చైతన్య అన్నారు. ఆదివారం రాత్రి విజయపురిసౌత్‌లోని ఏపీ పర్యాటక శాఖ లాంచీ స్టేషన్‌లో బోట్ డ్రైవర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన కేవీ ప్రభాకర్‌రావు సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పర్యాటక శాఖలో ప్రభాకర్ రావు సుదీర్ఘ కాలం పాటు బోట్ డ్రైవర్‌గా నిబద్ధతతో పనిచేశారని అభినందించారు. అనంతరం ఉద్యోగులు ప్రభాకర్‌రావు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లాంచీ స్టేషన్ మేనేజర్ శివారెడ్డి, హరిత రిసార్ట్ మేనేజర్ శ్రీనివాస్, అడ్మిన్ ఆఫీసర్ శ్రీధర్, అకౌంటెంట్ వెంకటేశ్వర్లు, పులుసు వీరారెడ్డి, భైరవ స్వామి, వినయతుల్లా, దత్తు పాల్గొన్నారు.

రూ.1.25 లక్షల మందులు వితరణ



సత్తెనపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు ఆర్యవైశ్య యువజన సంఘం గౌరవాధ్యక్షుడు కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో రూ.1.25 లక్షలు విలువైన రసికాడో్ట్రిల్ మందులను అందజేశారు. చిల్లపిల్లలు, పెద్దల్లో డయేరియా చికిత్సకు ఈ మందులను ఉపయోగిస్తారు. డిస్ట్రిక్ట్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రావిక్రింది మల్లికార్జునరావు సోమవారం వీటిని వితరణ చేశారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు స్పందిస్తూ.. ఎండాకాలం చిన్న పిల్లలు డయేరియా బారిన పడే అవకాశం ఉందన్నారు. వారు త్వరగా కోలుకునేందుకు ఈ మందులు ఉపయోగపడతాయన్నారు. వైద్యశాల ఏవో భవాని, డాక్టర్ రావిక్రింది శ్రీధర్ ఉన్నారు.

ఉద్యోగుల సేవలు అభినందనీయం



మాచర్ల: ఆర్టీసీ డిపో పరిధిలో సుదీర్ఘ కాలంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి సమర్థవంతంగా విధులు నిర్వహించిన ఎస్ జోజి యాదవ్, ఎంఎస్ బాబు సేవలు అభినందనీయమని పల్నాడు జిల్లా నేషనల్ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మురారి అన్నారు. సోమవారం పెన్షనర్స్ భవనంలో పదవీ విరమణ చేస్తున్న ఎస్ జోజి యాదవ్, బాబులను యూనియన్ నాయకులు ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి సోమనాథ్, సంయుక్త కార్యదర్శి సోమయ్య, యూనియన్ నాయకుడు పి.శ్రీనివాసరావు, నరహరితో పాటు రిటైర్డ్ ఉద్యోగులు వీరారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచే విధంగా అభివృద్ధి చేశాం

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



శ్రీనగర్‌లో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : నియోకవర్గంలో అభివృద్ధి చేశాం.. మళ్లీ ఆశీర్వదించాలని గురజాల నియోజకవర్గం అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామాపురం, శ్రీనగర్ గ్రామాల్లో సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పార్టీ విజయానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి నేతలకు పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. చరిత్రలో నిలిచే విధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపించామని, గత పాలకులు మాటలు చెప్పి అభివృద్ధిని విస్మరిస్తే.. తాను చెప్పిన మాట ప్రకారం అభివృద్ధి చేసి చూపించానని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ద్వారా పార్టీలు చూడకుండా అర్హతే ఆధారంగా సంక్షేమం అందించి అండగా నిలిచామని చెప్పారు. అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌ను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు.

ప్రతి కార్యకర్త కష్టాన్ని గుర్తు పెట్టుకుంటా..

సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయదుంధుభి మోగించేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే కాసు కోరారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్త కష్టాన్ని గుర్తు పెట్టుకుని తగిన గుర్తింపు, గౌరవం ఇస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతి గడపకు వివరించాలని, మరోసారి అవకాశం ఇస్తే మరింతగా అభివృద్ధి చేస్తామని ప్రజలకు చెప్పాలని సూచించారు. ఆయన వెంట సర్పంచ్ కూసం నాగిరెడ్డి, ఎంపీటీసీలు ఆకూరి కాశీరెడ్డి, ఆకూరి వెంకటరెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు వంగా పద్మావతి, నాయకులు నాగిరెడ్డి, పరిమి బాబు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ పంపిణీ విధానంపై అవగాహన కలిగి ఉండాలి

ఎంపీడీవో శంకర్‌రావు

రెంటచింతల: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో పెన్షన్ పంపిణీ విధానంపై కచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని నోడల్ ఆఫీసర్ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పెదప్రోలు శంకర్‌రావు అన్నారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు, డిజిటల్ అసిస్టెంట్‌లకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు పెన్షన్ పంపిణీ నూతన విధానంపై ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సంబంధిత రిటర్నింగ్ అధికారి (ఆర్వో) అనుమతితో గ్రామాలలో పెన్షన్ పంపిణీ చేసే సమయంలో సిబ్బంది కచ్చితంగా ఎన్నికల కోడ్ నియమ నిబంధనలు పాటించాలన్నారు. పెన్షన్ పంపిణీ ధ్రువీకరణ పత్రాలు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. సచివాలయాల పేర్లు, నగదు వివరాలతో కూడిన ధ్రువీకరణ పత్రాలు తమ కార్యాలయంలో, ఎంసీ లాగిన్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. పీఎస్, డబ్ల్యూఈఏ, డబ్ల్యూఏఎస్, డబ్ల్యూడబ్ల్యూఎస్ఎస్ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను గ్రామ పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఇద్దరూ బ్యాంక్‌లో నగదు తీసుకునే సమయం నుంచి పంపిణీ పూర్తయ్యే వరకు తప్పనిసరిగా తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. వేసవిలో మండల పరిధిలోని గ్రామాలలో మంచినీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.

విత్తనాల నాణ్యతలో రాజీ పడితే ఉపేక్షించం



విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్‌లో ఏడీఏ మద్దిలేటి, మాచర్ల ఏడీఏ జగదీశ్వర్‌రెడ్డి, ఏవోలు



విత్తనాల షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

ఏడీఏ మద్దిలేటి

రెంటచింతల: ప్రాసెసింగ్ యూనిట్‌ల ద్వారా విత్తనాలను తయారు చేసే వారు నాణ్యత విషయంలో రాజీ పడితే ఉపేక్షించేది లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ఏడీఏ ఎ.మద్దిలేటి హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రం రెంటచింతలలోని రోజ్‌లీన్ అగ్రిజెనిటిక్స్, శుభమస్తు, శశి కంపెనీల విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్‌లను ఆయన మాచర్ల ఏడీఏ జగదీశ్వర్‌రెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసి విత్తనాల తయారీ వివరాలు సేకరించి, ప్రాసెసింగ్ మిషనరీల పనితీరును పరిశీలించి తగు సూచనలు చేశారు. విత్తన మొలక శాతం జాగ్రత్తగా చూసి రైతులకు విక్రయించాలన్నారు. కచ్చితంగా అన్ని రకాల రికార్డులను నిర్వహించి ఎప్పటికప్పుడు వివరాలను నమోదు చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని విత్తన విక్రయ షాపులను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. రైతులకు విత్తనాలను విక్రయించిన సమయంలో బిల్లు బుక్‌లో తప్పకుండా ఆ రైతు సంతకం తీసుకోవాలన్నారు. మాచర్ల ఏడీఏ జగదీశ్వరరెడ్డి మాట్లాడుతూ షాపు నిర్వాహకులు, డీలర్లు విధిగా ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీల దగ్గర, అధీకృత డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. స్టాక్ రిజిస్టర్, స్టాక్ బోర్డు షాపులలో కచ్చితంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి క్రయ, విక్రయాలు జరిపినట్లు తమ దృష్టికి వస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఏవోలు బోయపటి బ్రహ్మారెడ్డి, జి.సురేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ

మాచర్ల: రాష్ట్ర వ్యవసాయ కమిషనరేట్ కార్యాలయం నుంచి సోమవారం పట్టణానికి వచ్చిన వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ.మద్దిలేటి, వ్యవసాయ శాఖాధికారి బి.వి. సురేష్‌రెడ్డి, మాచర్ల డివిజన్ పరిధిలోని పలు విత్తన దుకాణాలు తనిఖీ చేశారు. విత్తనాల నిల్వలు, అనుమతి పత్రాలను పరిశీలించారు. పలు దుకాణాలను తనిఖీ చేసిన అనంతరం అధికారులు విత్తనాల డీలర్లతో మాట్లాడుతూ తప్పనిసరిగా విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు ఇవ్వాలన్నారు. అధిక ఉష్ణోగ్రతలు ఉన్న నేపథ్యంలో పత్తిని వేయవద్దన్నారు. విత్తన డీలర్లు అనుమతులు ఉన్న విత్తనాలను మాత్రమే విక్రయించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీల్లో మాచర్ల సహాయ సంచాలకులు వి.జగదీశ్వరరెడ్డి, కట్టా లక్ష్మారెడ్డి, ఏవోలు, అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పర్యావరణ వేత్త సుబ్రమణ్యంతో ప్రకృతి ప్రేమికుడు అంకారావు (జాజి)

కారెంపూడి: తమిళనాడులో ఐదెకరాలలో అడవిని పెంచి పర్యావరణ పరిరక్షణ కోసం భారత దేశమంతా పర్యటించాలని లక్ష్యంగా పెట్టుకుని సైకిల్ యాత్ర చేస్తున్న పర్యావరణ ప్రేమికుడు సుబ్రమణ్యం సోమవారం కారెంపూడి పరిసరాలకు చేరుకున్నారు. కారెంపూడికి చెందిన ప్రకృతి ప్రేమికుడు సాక్షి ఎక్స్‌లెన్స్ అవార్డు గ్రహీత కొమెర అంకారావు (జాజి)ని సుబ్రమణ్యం కలుసుకున్నారు. వీరు పర్యావరణ పరిరక్షణ గురించి మాట్లాడుకున్నారు. పర్యావరణం ఇబ్బందుల్లో ఉందని అడవులను సంరక్షించుకుని తగ్గిన అడవుల శాతాన్ని పెంచకపోతే రానున్న రోజుల్లో మానవ మనుగడ ప్రమాదంలో పడిపోతుందని ఇప్పటికే ఆ ప్రభావం గత కొన్నేళ్లుగా పాక్షికంగా వ్యవసాయం, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తోందన్నారు. తన స్వస్థలం అరుణాచలం నుంచి సైకిల్ యాత్ర చేపట్టి రోజుకు వంద కిలో మీటర్లు ప్రయాణిస్తూ ఆంధ్రప్రదేశ్‌కు చేరుకున్నానని దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాలలో పర్యటించనున్నట్లు సుబ్రమణ్యం పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి దాని సంరక్షణ చేయడం లేదా తమ దగ్గరున్న విత్తనాలను విత్తన బంతులుగా తయారు చేసి అటవీ ప్రాంతంలో వర్షాకాలం చల్లాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.